స్వప్న మాసపత్రిక ఉగాది పేజీ కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

# గుప్పెడు



సత్యసాయి సేవా సమాజం వారి భజన పూర్తయింది.

తీర్థ ప్రసాదాలిస్తోంటే ఒకాయన మైక్ అందుకున్నారు.

"భక్తులకు విజ్ఞప్తి. మన సేవా సమాజం ద్వారా ఎందరో అనాథలకూ అభాగ్యులకూ అన్నదానం చేస్తున్న సంగతి మీకు తెలిసిందే. ఇదో యజ్ఞంలాంటిది. మీ అందరి సహాయ సహకారాలుంటేనే సక్రమంగా సాగుతుంది. దయచేసి మీరంతా తలో చెయ్యీ వేయాల్సిందిగా అర్థిస్తున్నాను. కనీసం ఇంట్లో ఒకరు అదనంగా వున్నారనుకుని వారికయ్యే వంట పదార్థాలని లేదా ఆ ఖర్చుని ఇచ్చి సహకరించండి. మీరు ఇవ్వగలిగినంత దానమిచ్చి అభాగ్యుల ఆకలి మంటల్ని ఆర్పాల్సిందిగా కోరుతున్నాను. మీరు చేసింది ఉడతా సాయమైనా సరే వారికదే మహోపకారం అవుతుందని మనవి చేస్తున్నాను....."

మాస్టారూ ఆయన భార్యా లేచి అడుగులో అడుగు వేసుకుంటూ ఇంటి ముఖం పట్టారు.

"ఆ పెళ్లి నడకేమిటే, రెండడగులెయ్"

"జనం దానధర్మాలు బాగానే చేస్తున్నారు....." సాలోచనగా అందావిడ.

"పూఁ వూఁ.... పరోపకార చింతన బాగానే పెరుగుతోంది. చాలా మంది యువకులు ప్రతినెలా ఒకరోజు జీతాన్ని ఇస్తున్నారట. అలాంటి పెద్ద మనస్సులు వున్నందునే అన్నదాన కార్యక్రమం నిర్విఘ్నంగా సాగుతోంది"

"మనం కూడా చిన్నెత్తు సాయం చెయ్యగలిగితే బావుణ్ను!"

"భగవంతుడు మనకి మనస్సు ఇచ్చాడు గాని శక్తి ఇవ్వలేదు. పెన్షన్ డబ్బులు కనాకష్టంగా సరిపోతున్నాయి. నిజం చెప్పాలంటే ఏదోలా సరిపెట్టుకుంటున్నాం. ఒకరి ముందు చేయి చాచాల్సిన అగత్యం తప్పించుకుంటున్నాం"

"అబ్బాయిలేమైనా పది రూపాయలు పంపితే బావుణ్ను"

"కన్నబిడ్డల దగ్గర్నుంచైనా సరే అర్థరూపాయి కూడా ఆశించకూడదు. వాళ్లంతట వాళ్లిస్తే ఆ దారి వేరు"

"అడిగితేనే పెట్టరు ఇహ అడగందే పెట్టడానికి వాళ్లు మనం కన్నవాళ్లు గాని మనల్ని కన్నవాళ్లు కాదుగా! అయినా నా పిచ్చిగానీ అడగందే అమ్మ అయినా పెట్టదని సామెత వుండనే వుంది లెండి!" నిట్టూరుస్తూ అంది.

"అది అబద్ధం. నువ్వు చెప్పు. తల్లి చూచేది బిడ్డ జేబుని కాదు కడుపునే కదా? బిడ్డ అలా భూమ్మీద పడతాడో లేదో ఇలా తల్లి గుండెల్లో పాలు పొంగుతాయి. నీకోమాట చెప్పనా?"

"చెప్పండి. ఎంతైనా రిటైర్డు తెలుగు పంతులాయె!" మురిపెంగా నవ్వింది.

"భూమ్మీద ఉచితంగా లభించేవి అమ్మపాలు మాత్రమేనే"

"బాగానే చెప్పేరు. ఆ పాలు ఇస్తేగాని ఆ తల్లి గుండె సలపరం తగ్గదు. గుండెల్లోకి తృప్తీ రాదు"

"అబ్బో. నువ్వూ గొప్ప వాక్యాలు సెలవిస్తున్నావ్"

"ఒకటా రెండా నలభై ఏళ్లనుంచి మీ అడుగులో అడుగు వేస్తున్నాను. ఆ మాత్రం ఇంగువ వాసన అంటదూ!"

ఇంటికెళ్లి కాళ్లూ చేతులూ కడుక్కుని అన్నం వడ్డించుకున్నారు. ఎంచేతో ఇద్దరికీ ఆకలిగాలేదు. ఏదో తప్పు చేస్తున్న భావనతో నలిగిపోయారు.

ఆ రాత్రి సరిగ్గా నిద్రపోనూ లేదు. ఏదో అశాంతి, మరేదో తపన వారిని నిలవనీయ లేదు.

మర్నాడామె యథాప్రకారం పనిలో పడింది. ఆయన చోళ్లజావ తాగి బయటి కెళ్లారు.

మాస్టారికి తెలుగు పద్యాల మీద విపరీతమైన మమకారం. అంచేత ఆసక్తి చూపిన పిల్లల ఇళ్ళకెళ్లి వేమన, సుమతీ శతక పద్యాల్ని ఉచితంగా నేర్పుతూంటారు.

తెలుగురాని ఇంగ్లీషు మీడియం విద్యార్థులక్కూడా అర్థం బోధ పరిచి పద్యాల్ని కంఠస్థం చేయిస్తూంటారు.

ఆదివారం నాడైతే ఆయనకి క్షణం తీరికుండదు. ఎన్ని చోట్ల కెళతారో ఆయనకే తెలీదు.

"తెలుగు భాషని ఉద్ధరించేస్తాం అనే వారిలా కాకుండా మీరు భాషాసేవ బాగానే చేస్తున్నారే" అని ఎవరైనా అంటే మాస్టారు నవ్వేస్తారు.

"అంత పెద్దమాట లెందుకులెండి. ఏదో నాకు తోచిన నాలుగు నీతిపద్యాలు నేర్పుతున్నాను. పిల్లలు గనుక ఇట్టే పట్టేస్తున్నారు. వారు గొంతెత్తి శ్రావ్యంగా వల్లిస్తే చాలు నా కడుపు నిండిపోతుంది" అని జవాబిస్తారు నిగర్వంగా.

పొద్దెక్కేక ఇంటి కొచ్చారు.

"ఇవాళ నలుగురికి నాలుగు పద్యాలొచ్చాయోయ్. అన్నట్టు పక్క వీధి చివరి పచ్చ డాబా లేదూ వారి మనవడూ మనవరాలూ వేసవి శలవుల్లో అమెరికా నుంచి వస్తారట. వారిక్కూడా పద్యాలు నేర్పమని అడిగారే" అన్నారు సంబరంగా.

"అయితే మీకు వేసవిలో సంక్రాంతి పండగ వస్తుందన్న మాట!"

అవునంటూ తలాడిస్తూ పీట వాల్చుకుని కూర్చున్నారు.

కొంచెం అన్నం తగ్గింది. తనకి తగ్గించుకుని ఆయనకి ఒక ముద్ద ఎక్కువేసింది ఇల్లాలు.

'బియ్యం రేటు పెరిగింది కదూ' అనుకుంటూ, వున్న అన్నాన్నే చెరి సగం చేశారు. ఆమె వద్దు వద్దన్నా వినిపించుకోలేదు.

పైగా, "కష్టమైనా సుఖమైనా చెరిసగమేనే" అనే సరికి మురిసిపోయిందావిడ.

నెలతిరిగింది. మొదటి వారపు భజనకి వెళ్లారిద్దరూ.

భజన అయ్యాక, "కాసిని బియ్యం తెచ్చానండీ.... ఇద్దామంటే సిగ్గుగా వుంది" చెంగుచాటున దాచిన చిన్న బియ్యపు మూట చూపుతూ అంది.

ఆశ్చర్యంగా చూశారు.

"రోజూ మనం వండుకునే బియ్యంలోంచి ఓ గుప్పెడు తీసి పక్కన పెట్టేసేనండీ...."

ఆయన కళ్లు అశ్రుపూరితాలయ్యాయి. భుజం తట్టి అభినందన పూర్వకంగా చూశారు.

"కుచేలుడి అటుకుల్లో శ్రీ కృష్ణుడు చూసింది విలువ కాదే అనురాగం. ఇద్దాం రా..."

ఇద్దరూ వెళ్లి నిర్వాహకులికి చెప్పారు. వారి సూచన మేరకు అన్నం వండుతోన్న గంగాళాల్లో ఎసరు బియ్యంతో బాటు వేశారు.

మరి గంటకి పిల్లలు భోంచేస్తోంటే భార్యకి చూపిస్తూ అన్నారు మాస్టారు "వారు తింటోన్న అన్నం మెతుకుల్లో నాలుగింటి మీద అన్నపూర్ణ అని నీ పేరు రాసి వుందే. నీ భాగ్యం ఎంత గొప్పదే నా బంగారూ!"

**(స్వప్న మాసపత్రిక, ఏప్రిల్ 2011)**